అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

పోలీసులకు పట్టుబడ్డ ఇద్దరు బిహారీలు • పరారీలో మరొకరు


బిహార్ నిందితుల నేరాలు, గంజాయి రవాణా తీరును వివరిస్తున్న రైల్వే డీఎస్పీ జావెద్

సికింద్రాబాద్: రైళ్లలో ప్రయాణాలు చేస్తూ టార్గెట్ చేసుకున్న ప్రయాణికుల బంగారు ఆభరణాలు, నగదును దొంగిలిస్తున్న ముగ్గురు బిహారీ అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టును సికింద్రాబాద్ రైల్వే పోలీసులు రట్టు చేశారు. ఇద్దరు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్న పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బీఎస్. సారస్వత్‌తో కలిసి డీఎస్పీ ఎస్ఎన్ జావెద్ నిందితుల వివరాలను వెల్లడించారు.

- బిహార్ రాష్ట్రం మంగర్ జిల్లాకు చెందిన అమర్‌జీత్‌కుమార్, అన్నురాజ్, నీరజ్‌కుమార్ ముగ్గురు మిత్రులు. అక్కడే అల్లరి చిల్లరగా తిరుగుతూ మద్యం, మాదకద్రవ్యాలకు బానాసలయ్యారు. పలు నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చారు.
- ఈ ముగ్గురు నాలుగు నెలల క్రితం సికింద్రాబాద్‌కు వచ్చారు. ఇక్కడి రైల్వేస్టేషన్ సమీపంలోని మోండా మార్కెట్‌లోని ఒక లాడ్జిలో గది అద్దెకు తీసుకుని బస ఏర్పాటు చేసుకున్నారు.
- నిత్యం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు రావడం జనరల్ బోగీ టికెట్ తీసుకుని స్లీపర్ కోచ్‌లలోకి చొరబడి ప్రయాణికులు నిద్రలోకి జారుకున్నాక చేతికందిన నగలు, నగదును దొంగిలించి పలాయనం చిత్తగించడం వృత్తిగా ఎంచుకున్నారు.
- ఆ వచ్చే డబ్బుతో జల్సాలు చేయడం అలవాటు పడ్డారు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోనూ వీరు పలు నేరాలకు పాల్పడ్డారు.
- ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో నిందితులు అన్నురాజ్, నీరజ్‌కుమార్ అనుమానాస్పద పరిస్థితులలో పోలీసులకు పట్టుబడ్డారు.
- ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారించగా రైలు ప్రయాణాల్లో తాము చేసిన నేరాలను అంగీకరించారు.
- ఈ నేరాలకు కీలక సూత్రధారిగా ఉన్న అమరజీత్‌కుమార్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి సుమారుగా రూ.3.50 లక్షల విలువచేసే 43 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తుండగా 5వ నెంబర ప్లాట్ ఫామ్‌పై అనుమానాస్పద లగేజీతో ఒక వ్యక్తి పట్టుబడ్డాడు. లగేజీని సోదా చేయగా అందులోకి గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. ఒడిశా రాష్ట్రం బరంపూర్‌కు చెందిన కల్లు ప్రదాన్ (30) అనే వ్యక్తి గంజాయి విక్రయించడం ద్వారా డబ్బు సంపాదించడం వత్తిగా ఎంచుకున్నారు. బరంపూర్‌లో గంజాయిని విక్రయించిన ప్రదాన్ సదరు గంజాయి ప్యాకెట్లను పూణేకు తరలించేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. పూణేకు వెళ్లేందుకు రైలు కోసం వేచిచూస్తున్న సమయంలో పోలీసులకు పట్టుబడ్డాడు. రూ.2.68 లక్షల విలువ చేసే 10 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులకు 'సెయింట్ ఫ్రాన్సిస్' చేయూత..


కుర్చీలు, వాటర్‌బాటిళ్లను అందజేస్తున్న సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ఫర్ ఉమెన్ అధ్యాపకులు

సనత్‌నగర్: బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల' ఉన్నత్ భారత్ అభియాన్' (యూబీఏ) కార్యక్రమంలో భాగంగా వివిధ తండాల్లోని పాఠశాలల విద్యార్థులకు చేయూతనందించింది. విద్య, సామాజిక అవసరాలను సమకూర్చేందుకు ముందుకువచ్చింది. కంప్యూటర్ సైన్స్ హెచ్‌ఓడీ సుజాత యెరువ, యూబీఏ కో-ఆర్డినేటర్ రూపాలి, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ రవికుమార్, విద్యార్థి ప్రతినిధుల నేతృత్వంలోని బృందం మౌలిక సదుపాయాల మెరుగుదలపై దృష్టిసారించి ఆయా తండాల పాఠశాలలకు మద్దతుగా నిలిచారు. వడ్డెనగూడ తండా, ఎర్రనూరు తండా, ఇప్పలగడ్డ తండా, కంది తండాలలోని పాఠశాలల తరగతి గదిలో విద్యార్థులు కూర్చొనేందుకు 126 కుర్చీలతో పాటు ఇంటి నుంచి స్కూల్‌కు మంచినీటిని తీసుకువెళ్లేందుకు 100 వాటర్ బాటిళ్లను అందించారు. అలాగే దివ్యాంగ్ సోలార్ సొసైటీ, దివ్యాంగ్ గార్మెంట్స్, లక్ష్మీనగర్ కాలనీలోని ఫిజికల్లీ ఛాలెంజ్డ్ ఎంటర్‌ప్రెన్యూర్ అయిన జుబేదా వెంచర్‌కు కూడా ఒక అల్మరాను విరాళంగా అందించారు.

మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ అమ్మవారిని బీఆర్‌ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంటరీ ఇంచార్జ్ తలసాని సాయి కిరణ్ యాదవ్ దర్శించుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్ తదితర నాయకులతో కలిసి ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

తమిళనాడు మంత్రిని కలిసిన బీజేపీ నేతలు

సనత్‌నగర్: తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి ఈవీవీ వేలును సనత్‌నగర్‌కు చెందిన బీజేపీ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాజకీయ పరిస్థితులు వారి మధ్య ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. బీజేపీ సీనియర్ నేత లింగంపల్లి నర్సింగరావు, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


ఈవీవీ వేలును కలిసిన లింగంపల్లి నర్సింగరావు

మనిషి మనుగడకు ఆధ్యాత్మిక మార్గం అనుసరణీయం


అయ్యప్పస్వామి మహాపడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన శ్రీ పాల్‌బాగ్ హనుమాన్ దేవాలయంలో శుక్రవారం శ్రీ అయ్యప్పస్వామి మహాపడి పూజా కార్యక్రమాలు భక్తిప్రపత్తుల మధ్య నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన అయ్యప్పస్వాముల సమక్షంలో పూజా కార్యక్రమం వైభవంగా సాగింది. వీరమణికంఠ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, వీరమణికంఠ సేవా సమితి ప్రతినిధులు కోడూరు రాజు, దేవరాజ్, చిరంజీవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పూజా అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ మనిషి మనుగడకు ఆధ్యాత్మిక మార్గం ఎంతో అనుసరణీయమన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

అడ్డగుట్ట: ఫుట్‌పాత్ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం తుకారాంగేట్ న్యూ బ్రిడ్జ్ నుంచి శాంతినగర్ వరకు ఫుట్‌పాత్ ఆక్రమణలను చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆపరేషన్ రోప్‌లో భాగంగా ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పాదచారులకు ఇబ్బందులు కలిగించే విధంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.


న్యూ బ్రిడ్జ్ వద్ద ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్‌కు గవర్నర్ అభినందన


అనూషను అభినందిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

లాలాపేట: తార్నాకకు చెందిన బీజేపీ జిల్లా మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి అనూష సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం తార్నాక డివిజన్ పర్యటనకు వచ్చిన హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను అనూష మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్ దత్తాత్రేయ అనూషను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షులు రాము వర్మ, బిజేపి సీనియర్ నాయకులు వెంకటేష్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, మోహన్, మహేశ్, వేణుయాదవ్ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం

సికింద్రాబాద్: కంటిని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా కాపాడుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ గౌడ్ అన్నారు. శుక్రవారం పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బ్రాహ్మణ బస్తీలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శిబిరంలో డాక్టర్ యశ్వంత్, సిబ్బంది గణేష్, సునీల్, శ్రీనివాస్, బీజేపీ నాయకులు నాగేశ్‌రెడ్డి, అజయ్‌కుమార్, లక్ష్మణ్, వేణుగోపాల్, పండిట్ శర్మ, త్రివేణి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



ప్రసన్నకుమార్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న డబ్ల్యుజీ ప్రసన్నకుమార్

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ ప్రసన్నకుమార్‌ను ప్రొఫెసర్ పీవీ రామ్మూర్తి ఒరేషన్ అవార్డు వరించింది. ఢిల్లీలోని అసోసియేషన్ ఆఫ్ జెరోంటాలజీ ఇండియా నుంచి ఆయన శుక్రవారం ఈ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు తాను అమ్మకి అంకితం చేస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ ప్రకటించారు.

ఉమెన్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ డైరెక్టర్‌గా నాగమణి



లాలాపేట: ఉమెన్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ తెలంగాణ డైరెక్టర్‌గా నాగమణి మునిగాల నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం సంస్థ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. రోజు రోజుకూ చిన్నారులు, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడమే ఉమెన్ సేఫ్టీ ఆర్గనైజేషన్ ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ



సనత్‌నగర్: అనారోగ్యంతో ఎర్రగడ్డలోని సెయింట్ థెరిస్సా హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న బేగంపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త నర్సింగరావును కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ పరామర్శించారు. ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు శ్రీనివాస్‌రెడ్డి, అరుణ్, రమాదేవి, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

18న యునైటెడ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్

ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యూసీసీ ప్రతినిధులు

రాంగోపాల్‌పేట్: యునైటెడ్ క్రిస్టమస్ సెలబ్రేషన్స్ కమిటీ, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న 46వ గ్రేటర్ హైదరాబాద్ క్రిస్మస్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్‌పర్సన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీడీ అరుణ తెలిపారు. శుక్రవారం సెయింట్ మేరీస్ చర్చి ఆవరణలో కమిటీ ప్రధాన కార్యదర్శి స్టీవా గెలెలీ, కో చైర్మన్ ఏసుదాస్, వైస్ చైర్మన్ రాబర్ట్ సూర్యప్రకాష్ తదితరులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్పీరోడ్‌లోని వెస్లీ పీజీ కళాశాల మైదానంలో సాయంత్రం 5గంటల నుంచి ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. పలువురు మంత్రులు, కార్డిన్ పూల ఆంథోని, సీఎస్ఐ డిప్యూటీ మాడరేటర్ రూబెన్ మార్క్, బిషప్ ఎంఏ డేనియల్, పాస్టర్ పురుషోత్తం తదితర ప్రముఖులతో పాటు అన్ని సంఘాలకు చెందిన బిషప్‌లు, పాస్టర్లతో పాటు సుమారు 20 వేల మంది వరకు క్రైస్తవులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో జేమ్స్ సిల్వెస్టర్, జాషువ, థామస్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ గుర్తింపు పత్రం అందజేత


మర్రి రాఘవయ్యకు గుర్తింపు పత్రం అందజేస్తున్న రైల్వే జీఎం ఏకే జైన్

అడ్డగుట్ట: రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో గుర్తింపు పొందిన దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రతినిధులకు రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ గుర్తింపు పత్రాన్ని అందజేశారు. శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పలువురు నాయకులతో కలిసి రైల్వే జీఎంను కలిశారు. ఈ మేరకు జీఎం చేతుల మీదుగా యూనియన్ గుర్తింపు పత్రాన్ని అందుకున్నారు. అనంతరం మర్రి రాఘవయ్య మాట్లాడుతూ రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో 30 శాతం ఓట్లు దక్కించుకున్న యూనియన్‌కు అధికారికంగా గుర్తింపు లభిస్తుందన్నారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌కు సుమారు 43 శాతం ఓట్లు వచ్చాయని చెప్పారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జోనల్ అధ్యక్షుడు ప్రభాకర్ ఆండ్ర్యూ, జాయింట్ జనరల్ సెక్రటరీలు రాజగోపాల్, భరణి భానుప్రసాద్, ఏజీఎస్ షేక్ రవూఫ్, ఎం. రుద్రారెడ్డి, సత్యవాణి, నారాయణ రావు, డివిజనల్ నాయకులు ప్రభురాజ్, కేవీఆర్. ప్రసాద్, నాయక్ తదితరులు ఉన్నారు.

ముగిసిన ఏఈజీ స్వర్ణోత్సవాలు


సదస్సు ముగింపు కార్యక్రమంలో అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో రెండు రోజుల జరిగిన అసోసియేషన్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిస్ట్ స్వర్ణోత్సవాలు, 46వ వార్షిక సదస్సు, ఎగ్జిబిషన్ శుక్రవారం ముగిశాయి. క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ముగింపు ఉత్సవాలకు రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కా కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొ.జి.ప్రభాకర్, మైనింగ్ కన్సల్టెంట్ డాక్టర్ పీవీ రావు, క్రిష్ణకుమార్ గుప్త, డాక్టర్ లింగస్వామితదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులకు సర్టిఫికెట్లను అందచేశారు.

యూనివర్సిటీ బోర్డు ద్వారానే పోస్టులు భర్తీ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ఆయా యూనివర్సిటీల పరిధిలోని బోర్డుల ద్వారానే (పాత పద్ధతి) అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎన్‌టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు బైరు నాగరాజు గౌడ్, విద్యార్థి నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ భీమ్‌రాం నాయక్ శుక్రవారం ప్రభుత్వాన్ని కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వర్సిటీల అధ్యాపకుల నియామకాల కోసం ప్రత్యేకంగా రిక్రూట్ మెంట్ బోర్డు ఏర్పాటు చేసి అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం తదితరాల వల్ల ఉద్యోగాల ప్రక్రియలో జాప్యం జరిగిందన్నారు. పాత పద్ధతిలోనే నియామకాలు చేపట్టాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి


డిప్యూటీ మేయర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

లాలాపేట: ఎర్రగడ్డ మున్సిపల్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆ డివిజన్ నుంచి ప్రతినిధి బృందం తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. జీహెచ్ఎంసీ, ఎలక్ట్రిసిటీ, వాటర్ వర్క్స్ విభాగాలకు చెందిన పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. స్పందించిన డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ఎర్రగడ్డ డివిజన్ ప్రాంత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మోతె శోభన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మోసిన్ కోర్షీ, ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షులు ఎర్ర కృష్ణ, మహమ్మద్, షాభి, రసూల్ తదితరులున్నారు.

మట్టి వ్యర్థాలను తొలగించరా?

- పట్టించుకోని జలమండలి అధికారులు
- ప్రమాదాల బారిన వాహనచోదకులు


పద్మారావునగర్ ప్రధాన రహదారిలో రోడ్డుపై డ్రైనేజీ మట్టికుప్పలు

బన్సీలాల్‌పేట్: రోడ్లపై డ్రైనేజీ మట్టి కుప్పలతో ప్రజలు, వాహనచోదకులు అసౌకర్యానికి గురవుతున్నారు. జలమండలి అధికారుల ఉదాసీనత, పర్యవేక్షణాలోపంతో వాహనచోదకులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో చీకట్లో రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలు కానరాక ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు సికింద్రాబాద్‌లో కోకొల్లలుగా ఉంటున్నాయి. స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ మారేడ్‌పల్లి జలమండలి డివిజన్ పరిధిలోని పలు సెక్షన్ కార్యాలయాల పరిధిలో ఉన్న డ్రైనేజీలను పెద్ద ఎత్తున శుభ్రం చేస్తున్నారు. అందులో ఉన్న మట్టి ఇతరత్రా వ్యర్థాలను తొలగిస్తున్నారు. ఆధునిక యంత్రాలతో మనిషి సహాయం లేకుండా డ్రైనేజీల్లోని మట్టిని ఎత్తి పోస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా రోడ్డుపై డ్రైనేజీల్లో నుంచి తీసిన మట్టిని మ్యానుహోల్ పక్కనే వేస్తున్నారు.అయితే రోజుల తరబడి నుంచి మట్టిని తొలగించడం లేదు. పద్మారావునగర్, బోయిగూడ, బన్సీలాల్‌పేట్, మారేడ్‌పల్లి, రాణిగంజ్, మోండా మార్కెట్, రెజిమెంటల్ బజార్, బోలక్‌పూర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై మట్టి కుప్పల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రత్యేకంగా వాహనాలు సిబ్బంది ఉన్నా..

మారేడ్‌పల్లి జలమండలి పరిధిలో డ్రైనేజీ మ్యానుహోల్స్ నుంచి తీసిన మట్టి కుప్పలను ఎప్పటికప్పుడు ఎత్తివేయడానికి గాను ప్రత్యేకంగా డీసిల్టింగ్ వాహనాలను ఏర్పాటు చేశారు. మారేడ్‌పలి జలమండలి పరిధిలోని 11 సెక్షన్ కార్యాలయాల పరిధిలో 11 వాహనాలు ఉన్నాయి. ప్రత్యేకంగా డ్రైనేజీ శుభ్రం చేసిన అనంతరం తీసిన మట్టిని తొలగించడానికి గాను ప్రైవేట్ వాహనాలు ఏర్పాటు చేశారు. ఇందు కోసం జలమండలి ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నది. అయినా అచరణలో మాత్రం సక్రమంగా వినియోగించుకోకపోవడం లేదు.

మట్టి కుప్పలను తొలగిస్తాం

మట్టిని తొలగించడానికే డీసిల్టింగ్ వాహనాలను ఏర్పాటు చేశాము.ఆ వాహనాలు ఎప్పటికప్పుడు తొలగించాలి. అయితే కొన్ని ప్రాంతాల్లో మట్టిని సకాలంలో తొలగించడం లేదని పలువురు తమ దృష్టికి తీసుకువచ్చారు. సకాలంలో మట్టిని తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాము. - వినోద్, మారేడ్‌పల్లి డివిజన్ జీఎం

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...) టమాటా.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 21, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 23, పందిరి బీర 38, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండ 23, గుండుబీన్స్ 48, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 35, దోసకాయ 18, బీట్‌రూట్ 37, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 35, చామగడ్డ 37, మొరంగడ్డ 23, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట: ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో శనివారం జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధి నర్సింగ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనహిత సేవా ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ కంటోన్మెంట్ సికింద్రాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏసీఎస్ నగర్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజి, పిడియాట్రిక్, షుగర్, బీపీ, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి


కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముషీరాబాద్ మండల పరిధిలోని పద్మారావునగర్, భోలక్‌పూర్ ప్రాంతాలకు చెందిన 11 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, ఆర్‌ఐలు శివప్రసాద్, రాము పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


లాలాపేటలో అయ్యప్ప పూజల్లో పాల్గొన్న భక్తులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో శుక్రవారం కన్నెస్వామి డి. జితిన్ యాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, అయ్యప్ప స్వామికి అభిషేకాలు, పల్లకీ సేవ, ఆభరణాల ఊరేగింపు తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిపించారు. పూజా మహోత్సవంలో భక్తులు శ్రీకాంత్, నవీన్, రాజేష్, శ్రీకాంత్ యాదవ్, అయ్యప్ప మలధారులున్నారు.

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఎస్డీరోడ్డులో బుధవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. రాంగోపాల్‌పేట్‌కు చెందిన గజవాడ శివనారాయణ గుప్త, కృష్ణ, ఆనంద్‌బాబుగౌడ్, వినయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహాపడి పూజలో మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బీఆర్ఎస్ నాయకులు తలసాని సాయి కిరణ్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

దివ్యాంగులకు ప్రోత్సాహం అందించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే

కంటోన్మెంట్: దివ్యాంగులకు తగిన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కేంద్ర సామాజిక న్యాయం – సాధికారత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. శుక్రవారం బోయిన్‌పల్లిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజేబిలిటీస్– నిపిడ్ (దివ్యాంగ్జన్)ను ఆయన సందర్శించారు. నిపిడ్ డైరెక్టర్ మేజర్ బీవీ రాంకుమార్ మంత్రికి స్వాగతం పలికి, నిపిడ్‌లోని వివిధ విభాగాల్లో అందిస్తున్న సేవలను వివరించారు. మంత్రి క్రాస్ డిసేబిలిటీ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌తో సహా సంస్థ యొక్క వివిధ సేవా కార్యక్రమాలను సందర్శించారు.

ఉత్సాహంగా క్రీడావార్షికోత్సవాలు



అడ్డగుట్ట: క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి కూడా దోహదపడుతాయని హైద్రాబాద్ డివిజన్ సీనియర్ డీపీఓ సుధీర్ కుమార్ అన్నారు. లాలాగూడ రైల్వే జూనియర్ కాలేజీ 55వ క్రీడా వార్షికోత్సవాలు సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ డీపీఓ సుధీర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు, క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పీటీఏ భరణి చంద్రిక, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన కార్పొరేటర్

సికింద్రాబాద్: సీతాఫలమండి డివిజన్ ఇందిరానగర్‌లో నిర్మిస్తున్న వరదనీటి కాల్వల పనులను స్థానిక కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది క్రితమే ఈ పనుల కోసం నిధులు మంజూరైనట్లు చెప్పారకు. వర్షాలు, ఎన్నికల నేపథ్యంలో పనులు ప్రారంభించడంలో జాప్యం జరిగిందన్నారు. రూ. 70 లక్షల వ్యయంతో ఇందిరానగర్ నిర్మిస్తున్న ఈ పనులతో వరదనీటి సమస్యలకు పరిష్కారమార్గం లభిస్తుందన్నారు. వరదనీటి కాల్వల పనులను నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తిచేయించాలని ఆమె అధికారులను కోరారు. అనంతరం బ్రాహ్మణ బస్తీలో జరుగుతున్న వాటర్ లైన్ పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.